క్లుప్తంగా

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే దుకాణాలు సీజ్



దుకాణాలను తనిఖీ చేస్తున్న నగర పంచాయతీ కమిషనర్

బేతంచెర్ల: నిబంధనలు ఉల్లంఘించి ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని పలు కిరాణ దుకాణాలు, తోపుడు బండ్లు, కూరగాయల మార్కెట్ల వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలువురి వ్యాపారుల వద్ద ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ఇకపై ప్లాస్టిక్ కవర్లు అమ్మితే ట్రేడ్ లైసెన్సులు రద్దు చేసి, షాపును సీజ్ చేస్తామని తెలిపారు.

చౌడేశ్వరి ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయానికి నంద్యాల జిల్లా మిట్నాల గ్రామానికి చెందిన సద్దల నాగసుదర్శన్‌రెడ్డి, అంజనమ్మ దంపతులు రూ.25 వేల విరాళం ఇచ్చారు. శుక్రవారం అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయ అర్చకుడు పవన్‌కు విరాళాన్ని అందజేశారు. దాతలను దుశ్శాలువాతో సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

యాగంటి ఆలయానికి రూ.20.46 లక్షల ఆదాయం



లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈఓ

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం హుండీ లెక్కింపు కార్యక్రమం జరిగింది. గత 90 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా మొత్తం రూ.20,46,031 ఆదాయం వచ్చిందని ఈఓ పాండురంగారెడ్డి తెలిపారు. నగదుతో పాటు సుమారు 650 గ్రాముల వెండి కూడా హుండీలలో లభించిందని వివరించారు. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ బండి మాహేశ్వరరెడ్డి, ఆలయ అర్చకులు మహేష్ శర్మ, సత్యనారాయణశర్మ, శ్రీరామ సేవ సమితి మహిళలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



స్కూల్ గేమ్స్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

కొలిమిగుండ్ల: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సీఐ రమేష్‌బాబు, ఎంఈఓ అబ్దుల్ కలాం అన్నారు. శుక్రవారం కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి పోటీలను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డితో కలిసి ప్రారంభించారు. వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్ తదితర పోటీల్లో పాల్గొనేందుకు వచ్చారు. క్రీడల్లో సత్తా చాటితే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందవచ్చని సూచించారు. మండల స్థాయి పోటీల్లో రాణించి డివిజన్ స్థాయిలో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. పాఠశాల హెచ్‌ఎం కొండప్ప, కో–ఆర్డినేటర్ నాగరాణి, ఉపాధ్యాయులు వైవీఎస్ నారాయణరెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



మాధవి (ఫైల్)

బేతంచెర్ల: అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన బేతంచెర్ల పట్టణం సంజీవనగర్ కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. కాలనీకి చెందిన మద్దయ్య, రామేశ్వరి దంపతుల కుమార్తె బోయ మాధవి (29)కి 14 ఏళ్ల క్రితం కర్నూలు పట్టణానికి చెందిన కృష్ణ అనే వ్యక్తితో వివాహం జరిగింది. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. రెండు నెలల క్రితం పుట్టింటికి వచ్చింది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి కొడుకు, కుమార్తె ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి ఆర్థిక సహాయం

బేతంచెర్ల: మండలంలోని వెంకటగిరి గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ ఎల్లస్వామి అనారోగ్యంతో నాలుగు నెలల క్రితం మృతి చెందారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం తరఫున మంజూరైన రూ.5.15 లక్షల చెక్కును శుక్రవారం ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, ఏపీఓ విజయరాణి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ చేతుల మీదుగా అందజేశారు.



పోతుదొడ్డి–హెచ్ఆర్ పల్లి రహదారిలో నరికివేసిన చెట్లు



తరలించేందుకు సిద్ధంగా ఉంచిన దుంగలు

వాల్టా చట్టానికి తూట్లు

- యథేచ్ఛగా భారీ వృక్షాల నరికివేత
- పట్టించుకోని అధికారులు

ప్యాపిలి: మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం. మొక్కలు పెంచుదాం–ఆరోగ్యాన్ని పంచుదాం. 'అమ్మ పేరుతో ఒక మొక్క'. 'ఇంటింటా చెట్టు–ఊరూరా వనం'. అనే నినాదాలతో ప్రభుత్వం మొక్కలు పెంచాలని అవగాహన కల్పిస్తోంది. అడవుల సంరక్షణ, మొక్కల పరిరక్షణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్తృతంగా ప్రచారాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణకు, అడవుల సంరక్షణకు, నీటి వనరుల సంరక్షణకు వాల్టా చట్టాన్ని అమలు చేస్తోంది. అయితే ఇవన్నీ కాగితాలకు మాత్రమే పరిమితం అవుతున్నట్లు అనిపిస్తోంది.

ఇష్టానుసారం నరికివేత

ఇంటి ఆవరణల్లో, పొలం గట్ల మీద ఉన్న భారీ వృక్షాలు నిత్యం నేలకొరుగుతున్నాయి. వివిధ అవసరాలు, భూముల అభివృద్ధి, రియల్ ఎస్టేట్ వ్యాపారం.. కారణం ఏదైనా అడ్డం పేరుతో చెట్లను తొలగిస్తున్నారు. వృక్షాలను తొలగించడం తప్పనిసరైతే అటవీశాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. అందుకు అటవీశాఖ నిబంధనల ప్రకారం ప్రభుత్వానికి చెట్టు విలువ చెల్లించి అందుకు రెట్టింపు మొక్కలు నాటాల్సి ఉంటుంది. అదేమీ లేకుండా చెట్లను నరికేసి వాటిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పెద్ద వృక్షాలను ఎక్కడో అడవుల్లో.. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో అయితే ఎవరికీ తెలియదు అనుకోవచ్చు. పల్లె–పట్టణం, రాత్రి–పగలు తేడా లేకుండా యంత్రాలతో నేలకూలుస్తున్నారు. వృక్షాలను కోయడానికి కూడా వ్యాపారులు, కాంట్రాక్టర్లు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. వీరికి ఎలాంటి అనుమతులు లేకపోయినా రైతులు, వ్యాపారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులతో ఒప్పందం కుదుర్చుకుని వృక్షాలను నరికేస్తున్నారు. వందల సంవత్సరాలున్న చింతచెట్లు, వేప చెట్లు సైతం నేలకొరుగుతున్నాయి. ఒక్కో చెట్టు సుమారు రూ.20 వేల నుంచి రూ. 40 వేల వరకు ధర పలుకుతోంది. ఇంటి అవసరాలకు ఉపయోగపడే చెట్లను మరింత ఎక్కువ ధరతో కొనుగోలు చేసేందుకు ఇతర ప్రాంతాల వారు ఆసక్తి చూపుతున్నారు.



ట్రాక్టర్‌లో తరలిస్తున్న దుంగలు

వాల్టా చట్టం అమలు ఏది?

డోన్ నియోజకవర్గంలో వాల్టా చట్టం ఎక్కడా అమలవుతున్న దాఖలాలు కనిపించడం లేదు. ఈ చట్టం ప్రకారం చెట్లను నరికివేయడానికి ముందుగా రెవెన్యూ అధికారుల అనుమతి తీసుకోవాలి. వీటిని తరలించాలంటే అటవీశాఖ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రెవెన్యూ, అటవీ శాఖ అధికారుల అనుమతి లేకుండానే విచ్చలవిడిగా వృక్షాలను నరికేస్తున్నారు. ప్రతి రోజూ వృక్షసంపద టింబర్ డిపోలకు, ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిపోతున్నాయి. దీంతో వాల్టా చట్టం అమలు ప్రశ్నార్థకంగా మారింది. సహజసిద్ధమైన వనాలు, చెట్లను సంరక్షించాల్సిన అధికారులు ఆ దిశగా కృషి చేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

23న జాబ్ మేళా

బనగానపల్లె రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అక్టోబర్ 23న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాలో పది కంపెనీల ప్రతినిధులు పాల్గొననున్నారని పేర్కొన్నారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, బీటెక్, బీ ఫార్మసీ, పీజీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8688651650, 9705998056 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

నిఖాకు సాయం

బనగానపల్లె రూరల్: పట్టణంలోని ఈద్గా నగర్ కాలనీకి చెందిన పఠాన్ మహబూబ్‌ఖాన్ కూతురు నిఖా(వివాహానికి)కు బనగానపల్లె ఫ్రెండ్స్ బ్లడ్ గ్రూప్ సభ్యులు శుక్రవారం రూ.15 వేల విలువైన సామగ్రిని అందించి మంచి మనసు చాటుకున్నారు. ఆయన ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని తమవంతు సహకారంగా మంచం, పరుపు, దిండ్లను అందజేశారు. గ్రూప్ సభ్యులు షాషా తదితరులు పాల్గొన్నారు.

శనగ విత్తనాలకు రిజిస్ట్రేషన్ పాట్లు



కొలిమిగుండ్ల ఆర్ఎస్‌కే వద్ద గుమికూడిన రైతులు

కొలిమిగుండ్ల: రబీ సీజన్ కోసం సబ్సిడీపై అందిస్తున్న శనగ విత్తనాల కోసం రైతులు పాట్లు పడాల్సి వస్తోంది. శుక్రవారం రైతు సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసే కార్యక్రమాన్ని వ్యవసాయాధికారులు ప్రారంభించారు. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్పు చేసింది. కొలిమిగుండ్ల మండలంలో 13 ఉన్న వీటి సంఖ్యను ఏడుకు కుదించారు. దీంతో పలు గ్రామాల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొలిమిగుండ్ల ఆర్ఎస్‌కే పరిధిలో కొలిమిగుండ్ల, మీర్జాపురం, బెలుం, బెలుం శింగవరం గ్రామాలు ఉన్నాయి. పేర్లు నమోదు ఆన్‌లైన్‌లో ఆలస్యం జరుగుతుండడంతో రైతులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. చింతలాయిపల్లె ఆర్ఎస్‌కే పరిధిలోకి ఇటిక్యాల, కనకాద్రిపల్లె, రాఘవరాజుపల్లె, మదనంతపురం, ఎస్.చెన్నంపల్లె గ్రామాలను విలీనం చేశారు. గత ప్రభుత్వం రైతులకు అన్ని విధాల అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతోనే 13 చోట్ల వీటిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వాటిని కుదించడంతో రైతులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. శనగ విత్తనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిశాక డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. 25 శాతం సబ్సిడీతో పంపిణీ చేసే విత్తనాలు పొందాలంటే రైతులు మళ్లీ ఆర్ఎస్‌కేలకు రావాల్సి ఉంటుంది. గ్రామాల నుంచి విత్తనాల కోసం ఆటోలు, ఇతర వాహనాలు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని ఆయా గ్రామాల్లోనే విత్తనాలు ఇచ్చేలా చూడాలని పలువురు రైతులు కోరుతున్నారు.



కోవెలకుంట్ల మండలం సౌదరదిన్నెలో వర్షానికి తడిచిపోయిన మినుము, ఓదెలు,



కోవెలకుంట్ల శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది

ఆగని వర్షం.. సాగని సేద్యం

- సంజామలలో అత్యధికంగా 35.2 మి.మీ వర్షం
- పొలాల్లో ఆరని తేమ
- ముందుకు సాగని రబీ
- సబ్ డివిజన్‌లో 56 వేల హెక్టార్లలో పంట సాగు లక్ష్యం

కోవెలకుంట్ల: అల్పపీడన ప్రభావంతో కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల్లో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం సంజామల మండలంలో అత్యధికంగా 35.2 మి.మీ వర్షం కురిసింది. అలాగే ఉయ్యాలవాడలో 15.2 మి.మీ, కోవెలకుంట్లలో 14.8 మి.మీ, దొర్నిపాడులో 4.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుంచి రబీ సీజన్ ప్రారంభం కాగా సబ్ డివిజన్‌లోని ఆరు మండలాల పరిధిలో 55,609 హెక్టార్లలో వరి, జొన్న, మొక్కజొన్న, పప్పుశనగ, కంది, మినుము, పెసర, తదితర పంటల సాగు సాధారణ విస్తీర్ణం. ఆయా పంటల సాగుకు సరైన అదును కాగా పది రోజుల నుంచి ఉదయం ఎండ తీవ్రంగా ఉండి సాయంత్రానికంతా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలతో పొలాల్లో తేమ శాతం ఆరకపోగా గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగి పొలాలు బీళ్లుగా మారడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో రబీ మొదటి పంటగా 40,016 హెక్టార్లలో పప్పుశనగ సాగు లక్ష్యం కాగా రసాయన ఎరువులు, విత్తనాలు సమకూర్చుకుని రైతులు విత్తనానికి సిద్ధంగా ఉన్నారు. అలాగే 7,119 హెక్టార్లలో జొన్న, 2,423 హెక్టార్లలో కంది, 1,332 హెక్టార్లలో మొక్కజొన్న పంటలు సాగు కావాల్సి ఉంది. ఇటీవల కురిసిన వర్షాలతో మరో వారం రోజులపాటు పొలాల్లో దిగలేని పరిస్థితి నెలకొంది. వరుణుడు తెరప ఇవ్వకపోతే వివిధ పంటల సాగుకు అదును దాటిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తత అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ హనుమంతునాయక్

కోవెలకుంట్ల: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్ సూచించారు. పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం శక్తి టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. ఇటీవల కాలంలో సైబర్ మోసాలు అధికమయ్యాయని.. జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. తెలియని నంబర్ల నంచి వాట్సాప్, వీడియో కాల్స్ వస్తే ఆధార్, బ్యాంకు ఖాతా, తదితర వ్యక్తిగత వివరాలు ఎట్టి పరిస్థితుల్లో తెలియజేయవద్దన్నారు. సైబర్ నేరాలపై 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, శక్తిటీం ఏఎస్ఐ నాగరాజు, అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, లక్ష్మీదేవి, వెంకటేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

14న ఫైర్ ఇంజిన్ వాహనం వేలం

డోన్ టౌన్: ఉమ్మడి కర్నూలు జిల్లాకు గత ప్రభుత్వ హయాంలో మంజూరైన రెండు అత్యాధునిక ఫైర్ ఇంజిన్లలో ఒకటి మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో డోన్ అగ్నిమాపక కేంద్రానికి కేటాయించారు. ఈ నేపథ్యంలో 2002 మోడల్‌కు చెందిన పాత ఫైర్ ఇంజిన్‌ను జిల్లా అగ్నిమాపక, విపత్తుల నివారణ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 14న వేలం ద్వారా విక్రయించనున్నట్లు డోన్ అగ్నిమాపక కేంద్ర అధికారి రంగస్వామి గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల ఉన్న వారు 13వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు డిస్ట్రిక్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ ఆఫీసర్, నంద్యాల పేరుపై రూ.10 వేల డీడీ తీసి, డోన్ అగ్నిమాపక కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బాక్స్‌లో వేయాలని సూచించారు. ఫైర్ ఇంజిన్‌ను పరిశీలించాలనుకునే వారు డోన్ అగ్నిమాపక కేంద్రానికి రావచ్చని తెలిపారు.

జీఎస్టీ తగ్గింపు సామాన్యులకు మేలు

బేతంచెర్ల: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జీఎస్టీ తగ్గింపు వల్ల సామాన్యులు, మధ్యతరగతి ప్రజలకు గణనీయంగా మేలు జరుగుతుందని జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ భువనేశ్వరి తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఫజుల్ రహ్మాన్ ఆధ్వర్యంలో 'సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్'పై అవగాహన కల్పించారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, కిరాణా సామగ్రి, మందులు, వైద్యం, జీవిత బీమా, దస్తావేజులు, పాదరక్షలు, స్టేషనరీ, ట్రాక్టర్లు, కార్లపై అమలవుతున్న తగ్గింపులను వివరించారు. జీఎస్టీ సూపరింటెండెంట్ దస్తగిరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ లైన్ ప్రారంభం

కొలిమిగుండ్ల: సంజామల నుంచి కల్వటాల సమీపంలోని రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ వరకు ఏర్పాటు చేసిన 22 కి.మీ రైల్వే ఎలక్ట్రికల్ లైన్‌ను కోవెలకుంట్ల రైల్వే స్టేషన్‌కు చెందిన ఇంజినీర్ వీరభద్రయ్య శుక్రవారం ప్రారంభించారు. ఎలక్ట్రికల్ లైన్ 25 వేల వోల్టుల సామర్థ్యంతో సంజామల, కానాల, మంగపల్లి, గిద్దలూరు, రెడ్డిపల్లె, రామిరెడ్డిపల్లె గ్రామాల మీదుగా ఫ్యాక్టరీ వరకు ఏర్పాటు చేశారు. రామ్‌కో అడ్మిన్‌హెడ్ రామరాజు, యూనిట్‌హెడ్ మీనాక్షి సుందరం పాల్గొన్నారు.

వైద్యం కన్నా రెఫర్ కేసులే ఎక్కువ

డోన్ టౌన్: స్థానిక వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో నాణ్యమైన వైద్య సేవలు అందక, ఎక్కువగా ఇతర ఆస్పత్రులకు, కర్నూలుకు రోగులను రెఫర్ చేస్తున్నారని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రణత్ యాదవ్ విమర్శించారు. శుక్రవారం నక్కిరామన్న భవన్‌లో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఆస్పత్రికి అవసరమైన స్థాయిలో వైద్య పరికరాలు, డాక్టర్లు నియమించకపోవడంతో ప్రజలకు సరైన వైద్య సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి నిరసన



విధులు బహిష్కరించి ఆందోళన నిర్వహిస్తున్న న్యాయవాదులు

కోవెలకుంట్ల: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ శుక్రవారం కోవెలకుంట్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు గేటు ఎదుట ఆందోళన చేపట్టారు. అలాగే ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని జమ్మలమడుగు చౌరస్తాలో ఉన్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓబులేసు, ఉపాధ్యక్షుడు శేఖర్, ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు కరీంబాషా, సుధాకర్, ఓబులేసు మాట్లాడుతూ.. సుప్రీకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై రాకేశ్ కిషోర్ అనే న్యాయవాది చెప్పు విసరడం మొత్తం న్యాయ వ్యవస్థపై జరిగిన దాడిగా భావించాలన్నారు. సదరు న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు వాసగిరి సాయికృష్ణమూర్తి, మధుసూదన్‌రెడ్డి, బాలమురళీకృష్ణ, అరికట్ల మల్లికార్జునరెడ్డి, విష్ణుమనోహర్‌రెడ్డి, నరసింహుడు, రమేష్, సుధాకర్, కాశీం సాహెబ్, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యం

బేతంచెర్ల: పట్టణానికి చెందిన దాసరి రవి, శివనాగలక్ష్మి దంపతుల కుమార్తె మాధురి, యశ్వంత్ వివాహం 3 రోజుల క్రితం జరిగింది. శుక్రవారం మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి నూతన దంపతులను ఆశీర్వదించారు. ఆయన వెంట నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రుడు, అధికార ప్రతినిధి మురళీకృష్ణ, నాయకులు తిరుమలేశ్వర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, గూని నాగరాజు, నారాయణ, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

సంజామల: మండలంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ దుర్గ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. మరమ్మతు పనుల కారణంగా సంజామల, అకుమల్ల, పేరుసోముల సబ్‌స్టేషన్ పరిధిలోని వసంతాపురం, ఆల్వకొండ, రెడ్డిపల్లె, కమలపురి, కానాల, నట్లకొత్తూరు, ముక్కమల్ల, ముదిగేడు తదితర గ్రామల్లో విద్యుత్ ఉండదన్నారు. నియోగదారులు గమనించాలని సూచించారు.

- **డోన్ టౌన్:** మండలంలోని యు.కొత్తపల్లె సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతు కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలు, పరిశ్రమలకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంటు తెల్లవారుజామున 5 నుంచి ఉదయం 11 గంటల వరకు.. తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇస్తామన్నారు. అలాగే పట్టణంలోని లక్ష్మీ ఫంక్షన్ హాల్, మహాలక్ష్మీ హాస్పిటల్, కురుకుందకాలనీ, పండరీనగర్, పాతపేట, కొత్తపేట, కొండపేట తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈ నాగేంద్ర తెలిపారు.

సామాజిక తనిఖీ బహిరంగ సభ



సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు

బనగానపల్లె రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం జాతీయ ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బహిరంగ సభ జరిగింది. ఇన్‌చార్జి ఎంపీడీఓ బాలాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికిగాను మండలంలో చేపట్టిన 1,466 పనులకు రూ.14,02,35,089 ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ పనులపై సోషల్ ఆడిట్ స్టేట్ రిసోర్స్ పర్సన్ చంద్రమోహన్ చౌదరి ఆధ్వర్యంలో ఆడిట్ బృందం సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 9 వరకు అన్ని గ్రామాల్లో తనిఖీలు చేపట్టింది. ఈ ఆడిట్ నివేదికను బహిరంగ ప్రజావేదికలో ప్రజల ముందు ఉంచారు. ఆడిట్ నివేదిక ప్రకారం రూ.14.02 కోట్ల పనుల కింద రూ.52,242 విలువైన అవినీతి ఘటనలు వెలుగుచూశాయి. ఈ మేరకు బాధ్యులైన ఎన్ఆర్‌జీఎస్ సిబ్బందిని గుర్తించి, వారి వద్ద నుంచి ఆ మొత్తాన్ని రికవర్ చేయాలని జిల్లా పీడీ సూర్యనారాయణ ఆదేశించారు. అయితే ఈ బహిరంగ సభ ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో కార్యక్రమం తూతూ మంత్రంగానే సాగిందని కొంతమంది విమర్శించారు. అంబుడ్స్‌మెన్ సరేంద్రబాబు, ఎస్‌టీఎం సత్యనారాయణ, ఏపీడీ నరేంద్రకుమార్, పీఆర్ ఏఈ రమణ, ఏపీఎంలు, ఈసీలు పాల్గొన్నారు.



ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పిస్తున్న సీఐ

సైబర్ నేరాలతో జాగ్రత్త

డోన్ టౌన్: స్మార్ట్‌ఫోన్, అండ్రాయిడ్ వినియోగదారులు గుర్తు తెలియని లింకులను ఓపెన్ చేయవద్దని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐ రాకేష్, ఎస్ఐ మమత సూచించారు. మండలంలోని సీసంగుంటల గ్రామంలో శుక్రవారం సాయంత్రం గ్రామస్తులకు వివిధ నేరాలపై అవగాహన కల్పించేందుకు డిజిటల్ స్క్రీన్ ద్వారా విజువల్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమే కాకుండా, ఆరోగ్యపరంగా ప్రమాదాలను కలిగిస్తాయన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోవడం మాత్రమే కాక, వారి కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతింటాయని చెప్పారు. మత్తు పదార్థాలు, మద్యం, పేకాట, జూదం, మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూడదని, యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు, మోసాలకు బలికాకూడదని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించమని, అలాంటి సమాచారం తమకు అందించాల్సిందిగా కోరారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ ధరించాలని సూచించారు.

పింఛన్‌లు తగ్గించాలనుకోవడం బాధాకరం



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న దివ్యాంగులు

కొలిమిగుండ్ల: ఏళ్ల తరబడి పింఛన్‌లు తీసుకుంటుంటే కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్లలో కోత విధించాలని చూస్తుండడం బాధాకరమని దివ్యాంగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు దేవరాజు ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై శుక్రవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డికి వినతి పత్రం అందజేశారు. సమాజంలో దివ్యాంగుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. పాత సదరం సర్టిఫికెట్లను కొనసాగించి 85 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులకు, మంచానికే పరిమితమైన వారికి రూ.15వేలు పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 60 శాతం వికలత్వం ఉన్న వారికి వయసుతో సంబంధం లేకుండా త్రీవీలర్ స్కూటీలు ఇవ్వాలని కోరారు. దివ్యాంగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.